శని వారం
10-06-2023
సంపుటి - 08,
సంచిక - 324
పేజీలు - 4
వెల రూ. 5/-
Telangana
Andhra Pradesh
CEO & Editor : G. PRUDHVIRAJ
RNI NO: TELTEL/2016/73311
www.samasamajam.in
# సమ సమాజం
SAMA SAMAJAM TELUGU DAILY
తెలుగు దిన పత్రిక
❍ Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

# పోడు భూములకు పట్టాల పంపిణీకి రంగం సిద్ధం



## పది ఎకరాలకు మించితే పట్టాలు ఇవ్వరు

## ప్రభుత్వ ఉద్యోగం ఉన్నా ఇవ్వరు



**హైదరాబాద్, జూన్ 9 (సమ సమాజం):** పోడు భూముల పట్టాలపై రైతుల్లో మళ్లీ ఆశలు చిగురిస్తున్నాయి. పోడు భూముల సమస్య పరిష్కారం కోసం బాధిత రైతులు ఏళ్ల తరబడిగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే క్రితం పోడు భూముల బాధితుల నుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరించి ఆన్‌లైన్ చేశారు. దశాబ్ది ఉత్సవాల వేల పోడు భూముల పట్టాలు ఇచ్చేందకు ప్రభుత్వం కసరత్తు పూర్తి చేసినట్లు సమాచారం. ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేయడంలో జాప్యం జరగడంతో తరచూ ఫారెస్ట్ అధికారులు, రైతులకు మధ్య వివాదాలు కొనసాగుతూ వచ్చాయి. ఈ క్రమంలోనే ప్రభుత్వం పోడుభూములకు సంబంధించి వచ్చిన దరఖాస్తులపై క్షేత్రస్థాయి పరిశీలనకు సిద్ధమైంది. పోడుభూములపై అధారపడి ఉన్నవారి కుటుంబాల్లో ప్రభుత్వ ఉద్యోగమున్నా అనర్హులు గానే చూస్తున్నారు. గిరిజనులైతే 25 ఏళ్లపాటు, గిరిజనేతరులయితే 75 ఏళ్లపాటు పోడు సాగు చేస్తున్నట్లు అధారాలు

3వ పేజీలో...

# కేసీఆర్ పాలన సంక్షేమానికి స్వర్ణయుగం

- అభివృద్ధి, సంక్షేమం జోడుగుర్రాల్లా పరుగులు
- తెలంగాణ పథకాలు అమలయివుంటే దేశం దశ మారేది
- సిద్దిపేటలో నిర్వహించిన సంక్షేమ ఉత్సవాల్లో మంత్రి హరీశ్ రావు



**సిద్దిపేట,జూన్9(సమ సమాజం):** ముఖ్యమంత్రి కేసీఆర్ పాలన సంక్షేమానికి స్వర్ణయుగం అని మంత్రి హరీశ్ రావు అన్నారు. అభివృద్ధి, సంక్షేమం జోడుగుర్రాల్లా పరుగులు తీస్తున్నాయని అన్నారు. తెలంగాణ పథకాలు దేశవ్యాప్తంగా అమలయి ఉంటే ఇవాళ దేశం దశ మారేదన్నారు. కాంగ్రెస్ పాలనలో రెండు, మూడు రోజులకు ఒకసారి మంచి నీళ్లు వచ్చేవి, ఇప్పుడు మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి సురక్షిత మంచి నీళ్లు ఇస్తున్నామని వెల్లడించారు. నేరుగా పొయ్యి దగ్గరకే తాగునీరు వస్తున్నదని స్పష్టం చేశారు. సీఎం కేసీఆర్ పాలనలో అత్తా కోడళ్ల పంచాయితీలు బందయ్యాయని చెప్పారు. వృద్ధులు, వికలాంగులకు ఆత్మగౌరవం పెంచారని తెలిపారు. గాంధీ భవన్‌లో

3వ పేజీలో...

# ధరణితో భారీ భూ కుంభకోణం

## సమస్యలపై సమాధానం ఇవ్వని కేసీఆర్: భట్టి



**నల్లగొండ, జూన్ 9 (సమ సమాజం):** ధరణి' పేరుతో బీఆర్ఎస్ప్రభుత్వం దేశంలోనే అతిపెద్ద భూ కుంభకోణానికి పాల్పడుతోందని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ఆరోపించారు. ప్రజా సమస్యలపై తాను లేవనెత్తిన అంశాలపై సీఎం కేసీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం 'ధరణి' సాఫ్ట్‌వేర్ తెచ్చి కుట్రపూరితంగా పేదల భూములను లాక్కోవడం నిజం కాదా అని ప్రశ్నించారు. పేదల భూములు లాక్కొని తెలంగాణ ప్రభుత్వం శ్మశానవాటికలు, రైతువేదికలు, ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలతోపాటు అమెజాన్ వంటి కంపెనీలకు భూములు

3వ పేజీలో...

# వికలాంగులకు మరో వేయి పెన్షన్ పెంపు

## మంచిర్యాల వేదికగా సిఎం కెసిఆర్ వరాల జల్లు



- వచ్చే నెల నుంచే పెంచిన మొత్తం అందచేత
- సింగరేణి కార్మికులకు ముందే వచ్చిన దసరా
- వచ్చే దసరా బోనస్ 700 కోట్లుగా ప్రకటన
- సింగరేణిని కాపాడుకున్న ఘనత తమదే
- పదేళ తెలంగాణలో అద్భుత ప్రగతి
- ఇతరరాష్ట్రాలతో పోటీ పడుతూ ముందుకు
- దేశానికి దిశా నిర్దేశం చేసేలా పలు పథకాలు
- త్వరలోనే ఆసిఫాబాద్ కలెక్టరేట్ ప్రారంభిస్తాం
- మంచిర్యాల కలెక్టరేట్ ప్రారంభోత్సవంలో కెసిఆర్
- అందుబాటులోకి మంచిర్యాల సమీకృత కలెక్టరేట్
- మంత్రుల సమక్షంలో ప్రారంభించిన సిఎం కెసిఆర్
- బిఆర్ఎస్ కార్యాలయానికి ప్రారంభోత్సవం

**మంచిర్యాల, జూన్ 9 (సమ సమాజం):** రాష్ట్రంలోని వికలాంగులకు ముఖ్యమంత్రి కేసీఆర్ శుభవార్త వినిపించారు. తెలంగాణలోని వికలాంగులకు ఆసరా పెన్షన్లు పెంచుతున్నట్లు కేసీఆర్ ప్రకటించారు. పెంచిన పెన్షన్లు వచ్చే నెల నుంచి అమల్లోకి వస్తాయని కేసీఆర్ పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లాలో నిర్వహించిన బీఆర్ఎస్ ప్రగతి నివేదన సభలో కేసీఆర్ మాట్లాడారు. మొత్తం తెలంగాణ సమాజం బాగుండాలి అని కేసీఆర్ పేర్కొన్నారు. ముసలమ్మలు, ముసలి తాతలు ఆసరా పెన్షన్లతో బ్రహ్మాండంగా ఉన్నారు. వికలాంగులకు రూ. 3,116 పెన్షన్ ఇస్తున్నాం. ఇవాళ మంచిదినం. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు జరుగుతున్నాయి. ఈ సందర్భంలో వికలాంగుల పెన్షన్ కూడా పెంచబోతున్నాం. మరో వెయ్యి రూపాయలు పెంచుతున్నాం. మంచిర్యాల గడ్డ నుంచి తెలంగాణ ఈశాన్య ప్రాంతం నుంచి ప్రకటించాలని నేను సస్పెన్షన్‌లో పెట్టాను. వచ్చే నెల నుంచి రూ. 4,116 పెన్షన్ అందుతుందని కెసిఆర్ అన్నారు. అందరి సంక్షేమాన్ని, మంచిని చూసుకుంటున్నాం అని కేసీఆర్ తెలిపారు. అలాగే సింగరేణి కార్మికులకు ముఖ్యమంత్రి కేసీఆర్ శుభవార్త వినిపించారు. వచ్చే దసరా బోనస్‌ను ఇప్పుడే ప్రకటించారు. వచ్చే దసరాకు సింగరేణి కార్మికులకు రూ. 700 కోట్ల బోనస్ ఇస్తామని ప్రకటించారు. సంక్షేమంలో బాగున్నాం. వ్యవసాయంలో బాగున్నాం అని కేసీఆర్ తెలిపారు. సింగరేణి సోదరులు కూడా చాలా మంది ఈ సభలో ఉంటారు. సింగరేణి 134 ఏండ్ల చరిత్ర ఉంది. వాస్తవానికి అది మనకు సొంత ఆస్తి. నిజాం కాలంలో ప్రారంభమైంది. వేలాది మందికి అన్నం పెట్టింది. కాంగ్రెస్ పార్టీ హయాంలో సింగరేణిని సర్వనాశనం చేసింది. కేంద్రం నుంచి అప్పులు తీసుకొచ్చింది. అప్పు తిరిగి చెల్లించక, మన సొంతదైన కంపెనీని.. కేంద్ర ప్రభుత్వానికి 49 శాతం వాటా కింద అమ్మేసింది కాంగ్రెస్ ప్రభుత్వం. ఆ విధంగా సింగరేణిని పూర్తిగా నాశనం చేసింది అని కేసీఆర్

3వ పేజీలో...

# 12 నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

## వెబ్‌సైట్‌లో అందుబాటులో హాల్‌టిక్కెట్లు



**హైదరాబాద్, జూన్ 9 (సమ సమాజం):** ఈ నెల 12వ తేదీ నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు నిర్వహించనున్నారు. పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లను ఇంటర్మీడియట్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. విద్యార్థులు నేరుగా ఈ వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్స్ డౌన్ లోడ్ చేసుకోవచ్చు. అయితే వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న హాల్ టికెట్లతో విద్యార్థులకు పరీక్షా కేంద్రాలకు వస్తే, వారిని తప్పకుండా అనుమతించాలని బోర్డు అధికారులు చీఫ్ సూపరింటెండెంట్లకు ఆదేశాలు జారీ చేశారు. హాల్ టికెట్లపై ఆయా కాలేజీల ప్రిన్సిపల్స్ సంతకాలు తప్పనిసరి కాదని స్పష్టం చేశారు. ఆయా కాలేజీల ప్రిన్సిపల్స్ కూడా తమ లాగిన్ల ద్వారా హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసి విద్యార్థులకు అందజేయొచ్చు.

# కేసీఆర్ పాలనలో సంక్షేమానికి స్వర్ణ యుగం

## బీజేపీకి సంస్కారం, సంక్షేమం రెండూ తెలియవు

## బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



**నిజామాబాద్, జూన్ 9 (సమ సమాజం):** తెలంగాణ సీఎం కేసీఆర్ పాలనలో సంక్షేమానికి స్వర్ణ యుగంగా మారిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. అధికారుల కష్టం, ప్రజా ప్రతినిధుల ఆలోచన వల్లే రాష్ట్రం సంక్షేమ రంగంలో నెంబర్ వన్‌గా నిలిచింది అని చెప్పారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం నిజామాబాద్ జిల్లా నడిపల్లిలో జరిగిన సంక్షేమ సంబరాల్లో కవిత పాల్గొని మాట్లాడారు. బీజేపీకి సంస్కారం, సంక్షేమం రెండూ తెలియవని విమర్శించారు. ప్రతిపక్షాల ఆరోపణలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పాలనలో ఎంగిలి చేతితో మెతుకులు వేసేలా పెన్షన్ లు ఇచ్చారని, కానీ మన తెలంగాణ లో

3వ పేజీలో...

# కర్నాటక తరహాలో తెలంగాణలోనూ విజయం



- తెలంగాణతో పాటు, దేశంలోనూ కాంగ్రెస్ జెండా
- సెప్టెంబర్ 17నన మేనిఫెస్టో విడుదల చేస్తాం
- కెసిఆర్ అవినీతి, అక్రమాలను బద్దలు కొడతాం
- ధరణి పోర్టల్‌ను ఖచ్చితంగా రద్దు చేస్తాం
- దమ్ముంటే అక్రమాలపై చర్చకు రావాలి
- యూత్ కాంగ్రెస్ సమావేశంలో రేవంత్ వెల్లడి

**హైదరాబాద్, జూన్ 9 (సమ సమాజం):** కర్ణాటక తరహాలో ముందే మేనిఫెస్టో విడుదల చేయడానికి తెలంగాణ కాంగ్రెస్ సిద్ధమవుతోంది. ఇప్పటికే యూత్, రైతు, నిరుద్యోగ డిక్లరేషన్ ప్రకటించింది. త్వరలో మరిన్ని డిక్లరేషన్స్ ప్రకటించి ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ ప్లాన్ చేస్తోంది. తెలంగాణ విమోచన దినోత్సవం అయిన సెప్టెంబర్ 17వ తేదీన మేనిఫెస్టో విడుదల చేయాలని నిర్ణయించింది.. హైదరాబాద్‌లో యూత్ కాంగ్రెస్ జాతీయ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఇందులో రేవంత్ మాట్లాడుతూ.. త్వరలోనే ఎన్నికలు రాబోతున్నాయి. ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం కోసం మీరంతా కష్టపడాలి. తెలంగాణలో కేసీఆర్‌ను ఓడించి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలి. డిసెంబర్ 9న సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా తెలంగాణలో కాంగ్రెస్‌ను గెలిపించి కానుకగా ఇవ్వాలని పిలుపునిచ్చారు. పార్టీ, ప్రజల కోసం పోరాడే వారికే భవిష్యత్ ఉంటుందని నాయకుడిగా మారేందుకు యూత్ కాంగ్రెస్ ఓ వేదిక అని చెప్పారు. కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ మాణిక్ రావ్ ఠాక్రేనే దీనికి ఉదాహరణ అని చెప్పారు. వన్ నేషన్ వన్ పార్టీ అనేది బీజేపీ రహస్య అజెండా అన్నారు. బీజేపీ కుట్రలను ఛేదించి రాష్ట్రంలో కాంగ్రెస్ జెండా ఎగరేయాల్సి ఉందన్నారు. 2004 నుంచి 2014 వరకు జరిగిన అభివృద్ధి, 2014 నుంచి ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధిపై

3వ పేజీలో...

# హైదరాబాద్‌లో మరో దారుణం

## వివాహేతర సంబంధలో యువతి హత్య

## హత్యచేసి మ్యాన్‌హోల్‌లో పడేసిన పూజారి



హైదరాబాద్, జూన్9(సమ సమాజం): హైదరాబాద్‌లో మరో దారుణం వెలుగులోకి వచ్చింది. ఓ యువతిని పూజారి చంపేసి మ్యాన్‌హోల్‌లో పడేశాడు. తర్వాత ఏమీ తెలియనట్టు అమ్మాయి కనబడడం లేదని ఫజర్యాదు ఇచ్చాడు. సరూర్ నగర్ ప్రాంతానికి చెందిన వెంకటసాయి సూర్యకృష్ణ వృత్తి రీత్యా పూజారి. పెళ్లచి. ఇద్దరు పిల్లలు

3వ పేజీలో...

# వెనకబడిన తరగతుల ఆర్థికాభివృద్ధికే బీసీ బంధు

## సంక్షేమ సంబరాల్లో పాల్గొన్న మాజీ ఎంపి వినోద్

## పలువురు లబ్దిదారులకు చెక్కులు అందచేత

**వేములవాడ, జూన్ 9 (సమ సమాజం):** వెనకబడిన తరగతుల ఆర్థిక అభివృద్ధి కోసం మొదటి మెట్టుగా బీసీ బంధును ప్రభుత్వం ప్రారంభించిందని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ తెలిపారు.వేములవాడ పట్టణంలోని ఎస్ఆర్ఆర్ గార్గెన్ లో శుక్రవారం సంక్షేమ సంబురాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్దిదారులకు చెక్కులను అందజేశారు. అక్కడే ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వెనుకబడిన తరగతుల వారికి ఒక్కొక్కరికి బీసీ బంధు కింద లక్ష రూపాయలను ప్రభుత్వం అందజేస్తుందని వెల్లడించారు. తెలంగాణ ఉద్యమంలో భాగంగా 2002లో కేసీఆర్ నాయకత్వంలో దళిత పాలసీని ముందుగానే ప్రకటించామని గుర్తు చేశారు. ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేస్తున్నామని తెలిపారు. గోదావరి, కృష్ణ నదులను మళ్లించి కోటి ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామని వివరించారు. రైతులకు ఎకరానికి రూ. 10 వేల పంట పెట్టుబడి సాయం ప్రపంచంలో మరెక్కడా లేదని స్పష్టం చేశారు. దశాబ్ది ఉత్సవాలు జరుపుకునేట్లుగానే వచ్చే పదేళ్ల వరకు చేయవలసిన అభివృద్ధిని, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసే ఆలోచన ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం వల్ల కరీంనగర్ వాసులు హైదరాబాద్‌లాంటి నగరాలకు వెళ్లకుండా స్థానికంగానే ఆసుపత్రులను నెలకొల్పుతూ వైద్యసేవలను అందుబాటులో ఉంచారని వెల్లడించారు.కార్యక్రమంలో కలెక్టర్ అమరాగ్ జయంతి, ఎమ్మెల్యే రమేశ్ బాబు, మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి, ఎంపీపీలు భూర వజ్రమ్మ, బైరగొని లావణ్య, గంగం స్వరూప రాణి, జవ్వాజి రేవతి, ఉమా దేవి, చంద్రయ్య గౌడ్, జడ్పీటీసీలు మ్యకల రవి, గట్ల మీనయ్య, నాగం భూమయ్య, మాజీ మార్కె ఫెడ్ చైర్మన్ లోకబాపురెడ్డి, అధికారులు, నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

# వికలాంగులకు మరో వేయి పెన్షన్ పెంపు

(మొదటి పేజీ తరువాయి) ధ్వజమెత్తారు. 2014 కంటే ముందు కార్మికులకు ఇచ్చే బోనస్ 18 శాతం మాత్రమే అని కేసీఆర్ గుర్తు చేశారు. అంటే కేవలం రూ. 50 నుంచి 60 కోట్లు మాత్రమే కార్మికులకు పంచేది. తెలంగాణ వచ్చాక సింగరేణి నడక మారింది. 2014లో సింగరేణి టర్నోవర్ రూ. 11 వేల కోట్లు మాత్రమే. ఇవాళ అదే సింగరేణి టర్నోవర్‌ను రూ. 33 వేల కోట్లకు పెంచుకున్నాం. అదే విధంగా సింగరేణి లాభాలు కేవలం రూ. 300 నుంచి రూ. 400 కోట్లు మాత్రమే ఉండే. ఇవాళ సింగరేణిలో ఈ ఏడాది వచ్చిన లాభాలు రూ. 2,184 కోట్లు. వచ్చే దసరాకు సింగరేణి కార్మికులకు పంచబోయే బోనస్ రూ. 700 కోట్లు. సింగరేణిలో నూతన నియామకాలు చేసుకుంటున్నాం. 10 సంవత్సరాల కాంగ్రెస్ సామ్రాజంలో 6453 ఉద్యోగాలు మాత్రమే ఇచ్చారు. తెలంగాణ వచ్చిన తర్వాత డిపెండెంట్ ఉద్యోగాల హక్కును పునదర్ధరించి 19,463 ఉద్యోగాలను కల్పించాం. 15,256 మందికి డిపెండెంట్ ఉద్యోగాలు కల్పించాం అని కేసీఆర్ గుర్తు చేశారు. సింగరేణిలో ప్రమాదం జరిగి కార్మికులు చనిపోతే గత ప్రభుత్వాలు రూ. లక్ష ఇచ్చి చేతులు దులుపుకునేది అని కేసీఆర్ పేర్కొన్నారు. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 10 లక్షలు ఇస్తుంది అని తెలిపారు. వడ్డీ లేకుండా రూ. 10 లక్షల రుణం ఇంటి కోసం ఇస్తున్నాం అని కేసీఆర్ తెలిపారు. కార్యక్రమంలో మంత్రులు ప్రశాంత్ రెడ్డి, ఇంద్రకరణ్ రెడ్డి, జోగు రామన్న,బాల్క సుమన్ తదితరులు పాల్గొన్నారు.



# కేసీఆర్ పాలనలో సంక్షేమానికి స్వర్ణ యుగం




(మొదటి పేజీ తరువాయి) అమ్మ ప్రేమ లాగా కడుపు నింపే విధంగా పెన్షన్‌లు ఇచ్చుకుంటు న్నామన్నారు. సబ్బండ వర్గాలు చల్లగా ఉండాలని అమలు చేసే కార్యక్రమాలే సంక్షేమ కార్యక్రమాలని, నిరుపేదలు ఆత్మాభిమానంతో బ్రతికేలా చేయటమే నిజమైన సంక్షేమమని అన్నారు. జిల్లాలో 10 వేల మంది ఒంటరి మహిళలకు పెన్షన్ ఇస్తున్నామని, ఎంతో మంది కిడ్నీ పేషంట్‌ల కోసం జిల్లాలో 33 డయాలలిస్ కేంద్రాలను ఏర్పాటు చేసుకున్నామని వివరించారు. బీడీ కార్మికులకు పెన్షన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణనేనని, అది సీఎం కేసీఆర్ వల్లనే సాధ్యమైందని అన్నారు. జిల్లాలో 96 వేల మంది బీడీ కార్మికులకు పెన్షన్ ఇస్తున్నామని చెప్పారు. కేసీఆర్ అంటే మా వాడు అని రైతులు గర్వంగా చెప్పుకుంటున్నరని, విత్తు నాటే దగ్గర నుండి పంట చేతికి వచ్చేవరకు రైతులకు అండగా ఉంటున్న గొప్ప వ్యక్తి సీఎం కేసీఆర్ అని అన్నారు. జిల్లాలో 2 లక్షల 60 వేల మందికి రైతు బందు ఇస్తున్నామని, ఇప్పటివరకు రూ. 2385 కోట్లను రైతు బంధు ద్వారా అందించామని కవిత వివరించారు. బీగాల గణెళిశ్, బాజిరుడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో మరో దారుణం

(మొదటి పేజీ తరువాయి) కూడా ఉన్నారు. అయినా వేరే మహిళతో ఏర్పడిన వివాహేతర సంబంధం చిక్కుల్లో పడేసింది. వెంకటసాయికి అప్సర అనే యువతి పరిచయం ఏర్పడింది. వరుసకు ఆమె మేనకోడలు అవుతుందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పరిచయం కాస్త వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈ క్రమంలోనే పెళ్లి చేసుకోవాలని ఆమె ఒత్తిడి తెచ్చినట్టు తెలుస్తోంది. ఇద్దరు పిల్లలు ఉన్న వెంకటసాయి ఆమెను వదలించుకోవడానికి చాలా ప్రయత్నాలు చేశాడు. కానీ ఆమె పెళ్లి చేసుకోవాల్సిందే అని పట్టుబట్టాడు. చివరకు ఒత్తిడి ఎక్కువయ్యేసరికి ఆమెను హతమార్చాడు. మూడు రోజుల క్రితం అప్సరను కారులో శంషాబాద్ సుల్తాన్ పల్లికి తీసుకెళ్లాడు. అక్కడ ఎవరూ లేని ప్రాంతంలో ఆమె బండరాయితో కొట్టి చంపేశాడు. తర్వాత డెడ్‌బాడీని సంచిలో కట్టి తీసుకొచ్చాడు. సరూర్‌నగర్‌లోని ఓ మ్యాన్‌హోల్‌లో పడేశాడు. తర్వాత రోజు ఏమీ ఎరగనట్టు తన మేనకోడలు అప్సర కనిపించడం లేదంటూ శంషాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన మేనకోడలు ఫ్రెండ్స్‌తో భద్రాచలం వెళ్లేందుకు ప్లాన్ చేసినట్టు తెలిపారు. మూడో తేదీన తానే స్వయంగా శంషాబాద్ అంబేద్కర్ విగ్రహం వద్ద డ్రాప్ చేసినట్టు కంప్లైంట్‌లో చెప్పాడు. అయితే అదే రోజు ఆమెను కారులో తీసుకెళ్లి మత్తుమందు ఇచ్చి హత్యచేసినట్టు తెలుస్తోంది. కేసును నమోదు చేసుకున్న పోలీసులు సీసీటీవీ ఫుటేజ్ పరిశీలించారు. దీంతో వెంకటసాయి దురాగతం వెలుగులోకి వచ్చింది. వెంటనే అతన్ని అరెస్టు చేసి విచారిస్తే అసలు గుట్టంతా చెప్పుకొచ్చాడు. నిందితులు వెంకటసాయికృష్ణ... మ్యాన్‌హోల్‌లో ఆమె డెడ్‌బాడీ వేయడమే కాకుండా దాన్ని కాంక్రీట్‌తో కప్పేశాడు. దాన్ని ఇప్పుడు జేసీపీ సాయంతో వెలికి తీస్తున్నారు. దీనిపై అప్సర తల్లి మీడియాతో మాట్లాడుతూ..తన కూతురిని హత్య చేసిన నిందితుడిని ఉరి తీయాలన్నారు. సాయికృష్ణ ఇంత ఘోరానికి ఒడిగాడతాడని తాము అనుకోలేదన్నారు. తన కూతురుని ఎ÷-లాన్‌తోనే హత్య చేశాడన్నారు. తన కూతురు రోజూ గుడికి వెళ్లేదని.. అక్కడే సాయికృష్ణతో ఆమెకు పరిచయం ఏర్పడిందన్నారు. సాయికృష్ణ కూడా తరచూ తమ ఇంటికి వచ్చేవాడని.. కానీ తాము ఇలా చేస్తాడని ఊహించలేదని అప్సర తల్లి తెలిపారు.



# కేసీఆర్ పాలన సంక్షేమానికి స్వర్ణయుగం



(మొదటి పేజీ తరువాయి) వాళ్లకు అర్థంకాదని, ఊర్లోకి వచ్చి అవ్వ, తాతలను అడిగితే తెలుస్తుందన్నారు. తెలంగాణ దశాబ్ది వేడుకల్లో భాగంగా సిద్దిపేటలో నిర్వహించిన సంక్షేమ ఉత్సవాలకు మంత్రి హరీశ్ రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం మాట్లాడుతూ.. తెలంగాణలో తప్పా బీడీ కార్మికులకు ఏ రాష్ట్రంలోనైనా పెన్షన్ ఇస్తున్నారా అని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ సంపద పెంచి పేదలకు పంచారని చెప్పారు. పెద్ద కొడుకులా వృద్ధులకు పెన్షన్లు అందిస్తున్నారని చెప్పారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలతో పేదింట్లో వెలుగులు నిండాయన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 12 లక్షల 71 వేల మంది ఆడబిడ్డలకు మేనమామలా పెండ్లి చేశారని తెలిపారు. తొమ్మిదేండ్లలో ఆసరా పెన్షన్ల కింద 59 వేల కోట్లు అందించామన్నారు. అన్ని కులాలకు సంక్షేమ భవనాలు నిర్మిస్తున్నామని చెప్పారు. సిద్దిపేటలో 12 రెసిడెన్షియల్ స్కూళ్లు ఏర్పాటుచేశామన్నారు. రెసిడెన్షియల్ స్కూళ్లలో చదివిన విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదుగుతున్నారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో సీట్ల కోసం పోటీ ఏర్పడిందన్నారు. సిద్దిపేటను ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చామని వెల్లడించారు. పట్టణంలోని కోమటి చెరువు సర్వాంగ సుందరంగా తయారైందని, చెరువ వద్ద త్వరలో డైనోసర్ పార్క్‌ను ఏర్పాటుచేస్తామన్నారు. ప్రభుత్వ దవాఖానల్లో 33 వేల పడకలు ఏర్పాటు చేశామని మంత్రి అన్నారు. తొమ్మిదేండ్లలో 21 మెడికల్ కాలేజీలు ఏర్పాటుచేశామని తెలిపారు. వైద్య కళాశాలలు తెచ్చామని బీజేపీ నాయకులు అబద్దాలు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ పార్టీ నాయకుల తీరు సొమ్ము ఒకడిది.. సోకు మరొకడిది అన్నట్లు ఉందని విమర్శించారు. బండి సంజయ్ కరీంనగర్‌కు మెడికల్ కాలేజీ తెచ్చాడా అని ప్రశ్నించారు. అబద్దాల బీజేపీ నాయకులు బేషరతుగా క్షమాపణలు చేప్పాలని డిమాండ్ చేశారు. చిత్తశుద్ధి ఉంటే విభజన హామీలను అమలు చేయాలన్నారు. బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ పెట్టాలని వెల్లడించారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులవి నరం లేని నాలుకలని విమర్శించారు.



## ధరణితో భారీ భూ కుంభకోణం

(మొదటి పేజీ తరువాయి) అప్పగిస్తోందని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ దొరల పక్షాన నిలుస్తుంటే, కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన నిలబడుతుందన్నారు. దమ్ము, ధైర్యం ఉంటే ప్రజా సమస్యలపై తాను లేవనెత్తిన అంశాలను చర్చించడానికి సిద్ధంగా ఉండాలని భట్టి విక్రమార్క సవాల్ విసిరారు.

# కర్నాటక తరహాలో తెలంగాణలోనూ విజయం



(మొదటి పేజీ తరువాయి) చర్చకు సిద్ధంగా ఉన్నానని కేటీఆర్‌కు రేవంత్ సవాల్ చేసారు. ' 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఒక్క అవకాశం ఇవ్వాలని రేవంత్ రెడ్డి కోరారు. అగ్రనాయకులు అందుబాటులో ఉండే అవకాశాన్ని బట్టి బహిరంగ సభలు ఉంటాయి. కర్ణాటకలో మాదిరిగానే తెలంగాణలో కూడా కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. 2024 ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించి.. రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలి. దీనికి అవసరమైన కార్యాచరణపై యూత్ కాంగ్రెస్‌కు దిశా నిర్దేశం చేశామన్నారు. మేనిఫెస్టో ఆలస్యం చేయడం వల్లే గతంలో ఇబ్బంది పడినట్లు కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో రెండు లక్షల రుణమాఫీ, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, పంటకు మద్దతు ధరతో పాటు బోనస్, ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్, రైతుబంధు సహాయం పెంపు, చదువుకునే అమ్మాయిలకి ఎలక్ట్రికల్ బైక్స్, నిరుద్యోగ భృతి మొదలగు అంశాలు పొందపరచనున్నారు.కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ధరణి రద్దు చేస్తామని పునరుద్ఘాటించారు. గడీల పాలన పునరుద్ధరించేందుకే కేసీఆర్ ధరణి పోర్టల్‌ను తీసుకొచ్చారని రేవంత్ విమర్శించారు. కొద్ది మంది భూస్వాముల కోసమే ధరణి తీసుకొచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ధరణి పోర్టల్‌ను కచ్చితంగా రద్దు చేస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించారు. రంగారెడ్డి, సంగారెడ్డి, మల్కాజిగిరి భూముల్లో అవకతవకలు జరిగాయి. వేల ఎకరాల భూమిని కేసీఆర్.. బినామీలకు కట్టబెట్టారు. ప్రభుత్వ అధికారుల దగ్గర ఉండాల్సిన సమాచారం దళారుల చేతికి వెళ్లిపోయింది. ధరణి రాకముందు రైతుబంధు రాలేదా అని ప్రశ్నించారు. అభయ హస్తం పేరుతో ఐదు ప్రధాన అంశాలతో ప్రజల దగ్గరికి వెళ్తామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. పలు పార్టీల నేతలతో అధిష్టానం చర్చలు జరిపిందని, ప్రజలు కోరుకుంటున్న విధంగానే చేరికలు ఉంటాయని, కర్ణాటక ఫలితాలే తెలంగాణలో రిపీట్ అవుతాయన్నారు. సీఎం కేసీఆర్‌కు తన పేరు తీసే దైర్యం ఉందా? అని ప్రశ్నించారు. దమ్ముంటే తన పేరు తీయాలని ముఖ్యమంత్రికి సవాలు విసురుతు న్నానన్నారు. తన భూమి వివరాల కోసం చాలా రోజుల నుంచి రంగారెడ్డి కలెక్టర్ దగ్గరకి తిరుగుతున్నానని రేవంత్ అన్నారు. గడీల పాలన పునరుద్ధరించడానికి సీఎం కేసీఆర్ ధరణి పోర్టల్ తెచ్చుకున్నారని విమర్శించారు. భూస్వాములను తరిమి కొట్టడానికే నక్షల్బరీ ఉద్యమం వచ్చిందని, ధరణిలో పోర్టల్ ప్రభుత్వం చేతిలో లేదని, దళారుల చేతిలోకి పోయిందని అన్నారు. ధరణి లేకపోతే రైతుబంధు రాదనడం బ్రతకక్కువ పనని మండిపడ్డారు. ధరణి మోసాల వల్ల కేసీఆర్ కుటుంబం చర్లపల్లి జైలుకి వెళు ందన్నారు. చర్లపల్లి జైలులో కేసీఆర్ కుటుంబానికి డబుల్ బెడ్ రూం ఇల్లు కట్టిస్తామన్నారు.బావ బామ్మర్దులు కేటీఆర్, హరీష్ రావు వస్తే బహిరంగంగా చర్చిద్దామని రేవంత్ రెడ్డి అన్నారు. ఈ ప్రాజెక్టు విషయంలోనైనా చర్చకు సిద్దంగా ఉన్నామన్నారు. రెండు వేల రూపాయలకు రెండు ఫుట్ బాటిల్స్ కూడా రావడం లేదన్నారు. తండ్రి కొడుకులు నిప్పుతొక్కిన కోతుల్లా ఎగురుతున్నారని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కేసీఆర్ కుటుంబంలా ప్రజలను దోచుకోమని స్పష్టం చేశారు. సెక్రటేరియట్, అంబేద్కర్ విగ్రహం, అమరవీరుల స్థూపంపై ఒక్కొక్కరికి ఐదు సంవత్సరాల జైలు శిక్ష వేయిస్తామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణలో కేసీఆర్‌నుఓడించి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేయాలని యూత్ కాంగ్రెస్, నేతలు దీనిని సవాల్‌గా తీసుకోవాలిన రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కోసం మీరంతా కష్టపడాలి. పోరాడే వారికే భవిష్యత్ ఉంటుంది. రాజకీయ భవిష్యత్‌కు యూత్ కాంగ్రెస్ ఒక మంచి వేదిక. నాయకుడిగా మారడానికి యూత్ కాంగ్రెస్ ఒక వేదిక. 1200 మంది విద్యార్థి, యువత ప్రాణత్యాగాలతో తెలంగాణ ఏర్పడింది. డబుల్ ఇంజన్ అంటే ఆదానీ, ప్రధాని. దేశాన్ని దోచుకోవడమే ఈ డబుల్ ఇంజన్ పనని, బీజేపీ కుట్రలను ఛేదించి దేశంలో కాంగ్రెస్ జెండా ఎగరేయాలని రేవంత్ పిలుపునిచ్చారు.

# పోడు భూములకు పట్టాల పంపిణీకి రంగం సిద్ధం



(మొదటి పేజీ తరువాయి) చూపించాలి. రైతు కుటుంబానికి గరిష్టం పది ఎకరాలకు మించి ఉంటే దానిని స్వాధీనం చేసుకోవాలని సర్కారు నిర్ణయించింది. ఆర్వోఎఫ్ఆర్ చట్టం పరిధిలోనే అటవీ హక్కుల గుర్తింపు చట్టం పరిధిలోనే పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వనున్నారు. జిల్లాల్లో సర్వే కోసం బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందం పోడు భూములకు సంబంధించిన వివరాలు పరిశీలించడంతోపాటు ఇందుకోసం రూపొందించిన ప్రత్యేక యాప్‌లో వివరాలు పొందుపర్చనుంది. జిల్లాల్లో సర్వే మొదలు కావడంతో పోడు భూముల సమస్యకు పరిష్కారం లభిస్తుందని భావిస్తున్నారు. జిల్లాల్లోని వివిధ వివిధ మండలాలు, గ్రామాల్లో పోడు సమస్య ఉన్నట్లు గుర్తించారు. ప్రధానంగా గిరిజనుల కంటే గిరిజనేతరుల నుంచి దరఖాస్తులు ఎక్కువగా రావడం గమనార్హం. పోడు సమస్య ఉన్న చోట గ్రామసభలు నిర్వహించి దరఖాస్తులను స్వీకరించారు. గత నవంబరులో సర్పంచ్ అధ్యక్షతన గ్రామ కార్యదర్శి, రెవెన్యూ సహాయకలు, అటవీ బీట్ అధికారి, మండల సర్వేయర్లతో బృందాలు ఏర్పాటు చేసి గ్రామాల వారీగా గ్రామ సభలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు. ప్రస్తుతం జిల్లా స్థాయిలో అధికారులు దరఖాస్తుల పరిశీలనకు కసరత్తు పూర్తి చేశారు. వీటిని పూర్తి స్థాయిలో పరిశీలించి అర్హులకు హక్కు పత్రాలు అందించాల్సి ఉంది. 29 డిసెంబరు 2006 నుంచి ఆర్వోఎఫ్ఆర్ చట్టం అమల్లోకి వచ్చింది. 2005కు ముందు సాగులో ఉన్న గిరిజనులకు మాత్రమే హక్కు పత్రాలు జారీ చేయనున్నారు. ప్రస్తుతం సాగులో ఉన్నవారిని క్షేత్రస్థాయిలో గుర్తించ నున్నారు. తప్పుడు పత్రాలతో రెవెన్యూ రికార్డుల్లో నమోదైన భూములు కూడా ఉన్నాయి. అటవీ హక్కుల చట్టం ప్రకారం గిరిజనేతర కుటుంబాలకు గరిష్ఠంగా పదెకరాల వరకే అనుమతి ఇవ్వాలి. కనీసం మూడు తరాలు సాగులో ఉంటేనే హక్కు పత్రాలు ఇస్తారు. ఇప్పటికే గతంలో పలు జిల్లాల్లో కొంతమందికి హక్కు పత్రాలను అందించారు. తాజాగా ప్రభుత్వం మరో అవకాశం ఇవ్వడంతో ఇటీవల పోడు చేసుకున్న వారు దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాల్లో పోడు భూములకు సంబంధించిన దరఖాస్తుల ఆధారంగా క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వీరికి శిక్షణ కూడా ఇచ్చారు. బృందంలోని అధికారులు అటవీ భూముల కొలతలు సేకరించి విచారణ చేసి సంబంధిత వివరాలను వెంటనే యాప్‌లో పొందుపరుస్తారు. ప్రతీ బృందంలో పంచాయతీ కార్యదర్శి, అటవీ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది ఉంటారు. దరఖాస్తులపై త్వరితగతిన సర్వే పూర్తి చేసే విధంగా ఆదేశాలు ఇచ్చారు.

# ఐసీసీ ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్

## 296 పరుగులకు టీమిండియా ఆలౌట్

### అర్థ సెంచరీలతో ఆదుకున్న శార్దూల్, రహానే



లండన్,జూన్9(సమ సమాజం): ఐసీసీ ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ మ్యాచ్‌లో టీం ఇండియా తొలి ఇన్నింగ్స్ ముగిసింది. ఆస్ట్రేలియా బౌలర్ల ధాటికి భారత బ్యాటింగ్ ఆర్డర్ కుప్పకూలింది. 69.4 ఓవర్ల వద్ద భారత జట్టు 296 పరుగులు చేసి ఆలౌట్ అయింది. మహ్మద్ షమీ ఔట్ కావడంతో భారత్ ఆలౌట్ అయింది. ఆసీస్ బౌలర్ స్టార్క్ బౌలింగ్‌లో అలెక్స్ కారీకి క్యాచ్ ఇచ్చి మహ్మద్ షమీ వెనుదిరిగాడు. మహ్మద్ షమీ 11 బంతుల్లో 13 పరుగులు చేశాడు. భోజన విరామ సమయం అనంతరం రెండో సెషన్ ప్రారంభమైన వెంటనే టీం ఇండియా రెండో ఓవర్లలో 7 వికెట్ కోల్పోయింది. 61.6 ఓవర్ వద్ద అజింక్య రహానే ఔటయ్యాడు. 129 బంతుల్లో 89 పరుగులు చేశాడు. లంచ్ తర్వాత కమిన్స్ బౌలింగ్‌లో రహానే 89 పరుగుల వద్ద ఔటయ్యాడు. అజింక్య రహానే సెంచరీ పూర్తి చేస్తాడనుకున్న అభిమానుల ఆశలపై బౌలర్ కమిన్స్ నీళ్లు చల్లాడు. కమిన్స్ వేసిన బౌలింగ్‌లో కామెరూన్ గ్రీన్ క్యాచ్ పట్టుకోవడంతో అజింక్య రహానే వెనుదిరిగాడు. టీం ఇండియా జట్టు స్కోర్ 270 పరుగులు దాటడంతో ఫాలోఆన్ గండం తప్పింది. అర్థ సెంచరీతో శార్దూల్ ఠాకూర్ భారత్‌ను ఆదుకున్నాడు. 68.4 ఓవర్ వద్ద భారత్ 9వ వికెట్ కోల్పోయింది. భోజన విరామ సమయానికి 60 ఓవర్లలో టీం ఇండియా 6 వికెట్ల నష్టానికి 260 పరుగులు చేసింది. రహానే, శార్దూల్ ఠాకూర్ సెంచరీ భాగస్వామ్యంతో భారత్ స్కోర్ 260 దాటేలా చేశారు. ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 469 పరుగులు చేయగా.. ఆ తర్వాత తొలి ఇన్నింగ్స్ ఆడిన భారత్ 69.4 ఓవర్లలో కేవలం 296 పరుగులు చేసి మూడోరోజు లంచ్ బ్రేక్ తర్వాత కాపేపటికే ఆలౌట్ అయ్యింది. ఆస్ట్రేలియా జట్టుకు 173 పరుగుల భారీ ఆధిక్యాన్ని కట్టబెట్టింది. భారత బ్యాటర్లలో అజింక్య రహానే, రవీంద్ర జడేజా, శార్దూల్ ఠాకూర్ మాత్రమే రాణించారు. మిగతా వాళ్లంతా విఫలమయ్యారు. కెప్టెన్ రోహిత్ శర్మ, శుభ్‌మాన్ గిల్, చటేశ్వర్ పుజారా, విరాట్ కోహ్లీ ఇలా క్రీజులోకి వచ్చి అలా పెవిలియన్‌కు వెళ్లారు. టాప్ ఆర్డర్ కుప్పకూలడంతో.. రహానే, జడేజా ఇద్దరూ మరో వికెట్ పడకుండా జాగ్రత్తగా ఆడుతూ ఇన్నింగ్స్‌ను చక్కదిద్దారు.

# హాఫ్ సెంచరీ...సెంచరీ మిస్ అయిన రహానే

ఓవల్,జూన్9(సమ సమాజం): అజింక్య రహానే ఆసీస్ బౌలర్లను ధీటుగా ఎదుర్కొంటున్నాడు. పేస్ అటాక్‌తో అదరగొడుతున్న ఆసీస్ బౌలర్లను.. రహానే తన డిఫెన్స్ బ్యాటింగ్ శైలితో అడ్డుకుంటున్నాడు. వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్గ÷నైల్ తొలి ఇన్నింగ్స్‌లో రహానే హాఫ్ సెంచరీ నమోదు చేశాడు. 92 బంతుల్లో అతను 52 రన్స్ చేశాడు. కమ్మిన్స్ బౌలింగ్‌లో వరుసగా ఫోర్, సిక్స్ కొట్టి రహానే తన ఖాతాలో హాఫ్ సెంచరీ వేసుకున్నాడు. ఇవాళ ఉదయం భరత్ ఔటయ్యాడు. ఇండియా 49 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 209 రన్స్ చేసింది. రహానే 62, శార్దూల్ 16 రన్స్‌తో ఆడుతున్నారు.

# ఆస్ట్రేలియాలో కెసిఆర్ కప్ క్రికెట్

## టెర్నీ పోస్టర్‌ను ఆవిష్కరించిన కవిత

నిజామాబాద్,జూన్9(సమ సమాజం): ఆస్ట్రేలియాలో నిర్వహించనున్న కేసీఆర్ క్రికెట్ కప్ టోర్నమెంట్ పోస్టర్‌ను బీఆర్ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నిజామాబాద్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత రాష్ట్ర సమితి లక్ష్యాలను, ముఖ్యమంత్రి కేసీఆర్ భావజాలాన్ని వ్యాప్తి చేయడానికి బీఆర్ఎస్ ఆస్ట్రేలియా శాఖ ఆధ్వర్యంలో కేసీఆర్ క్రికెట్ కప్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా టోర్నీని నిర్వహిస్తున్న బీఆర్ఎస్ ఆస్ట్రేలియా అధ్యక్షుడు కాసర్ల నాగేందర్ రెడ్డిని ఆమె అభినందించారు. టోర్నమెంట్ నిర్వహణ వల్ల సీఎం కేసీఆర్ దేశాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లే ఎజెండా ను ఎన్ఆర్ఐలందరికీ చేరుతుందని ఆమె పేర్కొన్నారు. నాగేందర్ రెడ్డి మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించడానికి తెలంగాణ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ ప్రతీ గ్రామానికి స్టేడియం నిర్మించనున్నారని తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావాన్ని భారతీయులకు, ఎన్ఆర్ఐలకు తెలిసేలా క్రికెట్ టోర్నీని ఎంచుకున్నామని వివరించారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో బాబా ఫసియుద్దిన్ ,సేనాపతి రాజు, క్లిఅెం హరికృష్ణ రెడ్డి, రమేష్ చారి, బీ ఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



# టెస్ట్ క్రికెట్‌లో రాణించలేక పోతున్న కోహ్లీ



న్యూఢిల్లీ,జూన్9(సమ సమాజం): విరాట్ కోహ్లీ, చటేశ్వర్ పుజారా భారత క్రికెట్ జట్టుకు ఎంతో విలువైన ఆటగాళ్లు. కోహ్లీ అన్ని ఫార్మాట్లలో తన సత్తా చాటుతుండగా.. పుజారా టెస్టు క్రికెట్‌కు ఎంతో ప్రత్యేకమైన ఆటగాడు. అయితే, ఈ ఇద్దరు బ్యాటర్‌లు గత మూడేళ్లుగా టెస్టు క్రికెట్‌లో పెద్దగా రాణించలేకపోతున్నారు. 2020 నుంచి ఇప్పటివరకు వారి గ్రాఫ్ వరుసగా పడిపోతూ వస్తున్నది. ప్రస్తుతం లండగన్‌లోని ఓవల్ స్టేడియంలో భారత్ -ఆస్ట్రేలియా జట్ల మధ్య జరుగుతున్న వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో కూడా ఈ ఆటగాళ్లిద్దరూ విఫలమయ్యారు. ఇద్దరూ కేవలం 14 చొప్పున పరుగులు చేసి పెవిలియన్‌కు వెళ్లిపోయారు. ఇలాంటి ఆటతీరు వల్లే ఈ ఇద్దరు క్రికెటర్‌ల బ్యాటింగ్ సగటులు రోజురోజుకు పడిపోతున్నాయి. టెస్టుల్లో విరాట్ కోహ్లీ బ్యాటింగ్ సగటు 2020లో 53.62గా ఉండేది. కానీ ఇప్పుడది 48.72కు పడిపోయింది. అదేవిధంగా పుజారా బ్యాటింగ్ సగటు కూడా 2020లో 48.66గా ఉండేది. కానీ ఈ మధ్యకాలంలో పేలవమైన ఆటతీరుతో ఇప్పుడది 43.70కు దిగజారింది.




# సెర్బియాలో రాష్ట్రపతితో సిటాడెల్ బృందం భేటీ



సిటాడెల్ వెబ్ సీరిస్ బృందం రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిశారు.ప్రస్తుతం రాష్ట్రపతి సెర్బియా పర్యటనలో ఉన్నారు. సిటాడెల్ షూటింగ్ కూడా ఆ ప్రాంతంలోనే జరుగుతోంది. దీంతో సిటడెల్ టీమ్ రాష్ట్రపతిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ ఫొటోలను వరుణ్ ధావన్ సోషల్ మీడియాలో షేర్ చేశారు. రాష్ట్రపతిని కలిసే అవకాశం వచ్చినందుకు చాలా ఆనందంగా ఉందని, ఇది టీమ్‌కు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు.దర్శక ద్వయం రాజ్ అండ్ డీకే కూడా దీనిపై ట్వీట్ చేశారు. 'గౌరవనీయులైన భారతదేశ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము గారిని కలవడం చాలా సంతోషంగా ఉంది. కాసేపు మాతో ముచ్చటించారు. కామెడీ సినిమాలంటే ఇష్టమని చెప్పారు. సిటాడెల్' యాక్షన్ సిరీస్. అయినా, ఈ వెబ్ సిరీస్‌ను చూసేందుకు ప్రయత్నిస్తానని అన్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ టీమ్ చేసిన ట్వీట్లు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఇంగ్లిష్‌లో ప్రియాంక చోప్రా, రిచర్డ్ మ్యాడెన్ తదితరులు ప్రధాన పాత్రలో నటించిన ఈ సిరీస్‌ను ఇండియన్ వెర్షన్‌లో తెరకెక్కిస్తున్నారు.సినిమాలతోపాటు వెబ్ సిరీస్‌లపైనా దృష్టి పెట్టారు సమంత, రాజ్, డీకే దర్శకత్వంలో 'సిటాడెల్' సిరీస్‌లో నటిస్తోంది. ఇందులో వరుణ్ ధావన్ కథానాయకుడు. తాజాగా ఈ సిరీస్ టీమ్ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మును కలిశారు. ఈ ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి.

# నయన్, విఘ్నేష్‌ల పెళ్లికి ఏడాది







చిత్ర పరిశ్రమలో రొమాంటిక్ కపుల్స్‌లో లేడీ సూపర్ స్టార్ నయనతార, దర్శకుడు విఘ్నేశ్ శివన్ జంట ఒకటి. సుమారు ఏడేండ్లపాటు ప్రేమించుకున్న వీరు పెద్దల అంగీకారంతో గతేడాది జూన్‌లో వివాహబంధంతో ఒక్కటయ్యారు. కాగా, యన్-విఘ్నేశ్ మొదటి వివాహ వార్షికోత్సవం సందర్భంగా విఘ్నేశ్ శివన్ సోషల్ మీడియా ద్వారా భార్యకు పెళ్లి రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఓ ఎమోషనల్ పోస్ట్ పెట్టారు.నువ్వు నా జీవితంలోకి వచ్చి ఏడాది పూర్తైంది. ఈ ఏడాది ఎన్నో క్షణాలతో నిండిపోయింది. ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొన్నాం. అనేక ఎత్తుపల్లాలు ఎదురయ్యాయి. ఊహించని ఎదురుదెబ్బలు తగిలాయి. ఎన్నో పరీక్షలు ఎదురయ్యాయి. ఎన్ని కష్టాలు ఎదురైనా ఇంటికి తిరిగొచ్చి నా అందమైన ఫ్యామిలీని చూస్తే.. కోల్పోయిన ఎనర్జీ మొత్తం తిరిగి వస్తుంది. ఫ్యామిలీ ద్వారా వచ్చే కాన్ఫిడెన్స్ వేరే స్థాయిలో ఉంటుంది. కలలు సాకారం చేసుకునే శక్తినిస్తుంది. మన పిల్లలు ఉయిర్, ఉలగమ్‌లకు మంచి జీవితాన్ని అందించేందుకు ప్రయత్నిస్తాను' అంటూ పోస్ట్ పెట్టారు. దీంతోపాటు నయన్ తన ఇద్దరి పిల్లల్ని ఎత్తుకుని ఉన్న క్యూట్ ఫొటోలను అభిమానులతో పంచుకున్నారు. ఈ పోస్ట్, ఫొటోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. సుమారు ఏడేళ్లపాటు ప్రేమలో ఉన్న నయనతార, విఘ్నేశ్ శివన్ పెద్దల అంగీకారంతో గతేడాది జూన్ 9వ తేదీన వివాహబంధంతో ఒక్కటయ్యారు. మహాబలిపురంలోని ఓ రిసార్ట్‌లో వివాహం చేసుకున్న సంగతి తెలిసిందే. పెళ్ళైన 4 నెలలకే సరోగసి పద్ధతి ద్వారా నయన్, విఘ్నేశ్ శివన్ దంపతులు కవల పిల్లలకు తల్లిదండ్రులయ్యారు. పిల్లలకు ఉయిర్ రుద్రోనిల్ ఎన్ శివన్, ఉలగ్ దీవిక్ ఎన్ శివన్ అని నామకరణం కూడా చేశారు. ప్రస్తుతం ఈ జంట ఫ్యామిలీ లైఫ్‌ను ఎంజాయ్ చేస్తోంది.



Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in